







హద్దులు దాటి ఆదాయం

నవంబరు 15 న రేషన్ బియ్యం లారీని మంత్రాలయం మండలం మాధవరం చెక్ పోస్టు వద్ద అధికారులు సీజ్ చేశారు. ఆదోని నుంచి రాయచూరుకు బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు (ఫైల్)

కర్నూలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో రేషన్ బియ్యం మాఫియా పెట్రేగిపోతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ బియ్యం అక్రమ రవాణాకు కళ్లెం పడుతుందని ఆశిస్తే అదేం జరగ లేదు. పార్టీ రంగులు మార్చి కూటమి నాయకుల ఆశీస్సులతో కొందరు గుట్టుచప్పుడు కాకుండా సరిహద్దులు దాటిస్తున్నారు. దీని వెనుక పెద్ద మాఫియా ఉన్నట్లు తెలుస్తోంది. కర్నూలు నగరంలో ఇద్దరు బియ్యం డాన్‌లు, ఆదోనిలో బీజేపీ మాస్క్ వేసుకున్న మాజీ వైసీపీ యువ నేత కనుసన్నల్లో రేషన్ బియ్యం సరిహద్దులు దాటుతున్నట్టు తెలుస్తోంది. వీరికితోడు ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు ప్రాంతాల్లోనూ మాఫియా చెలరేగిపోతోంది. పలు ప్రాంతాల్లో ఎండీయూ వాహనాల అడ్డాగా ఈ భాగోతం సాగుతున్నట్టు సమాచారం. అధికారం ముసుగులో నెలనెలా సాగిస్తున్న రూ.కోట్ల రేషన్ బియ్యం కుంభకోణంపై ఆంధ్రజ్యోతి కథనం.



నవంబరు 16న ఆదోని మండలం బలదూర్ గ్రామంలో రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకున్న రాయితీ బియ్యం

- రెచ్చిపోతున్న బియ్యం మాఫియా
- కూటమి ప్రభుత్వంలోనూ ఆగని దందా
- అక్రమంగా కర్ణాటకకు రవాణా
- ఆదోనిలో బీజేపీ యువ నేత కనుసన్నలో వ్యాపారం
- కర్నూలులో ఇద్దరు బియ్యం డాన్‌ల ఇష్టారాజ్యం
- ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరులోనూ ఆగని వైనం
- రూ.కోట్లలో రేషన్ బియ్యం కుంభకోణం

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఏపీ ప్రభుత్వ పౌర సరఫరాల (సివిల్ సప్లయ్) శాఖ పర్యవేక్షణలో 2,437 నిత్యావసర సరుకుల పంపిణీ దుకాణాలు ఉన్నాయి. 12.18 లక్షల రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులు ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత బియ్యం, రూపాయికి కిలో బియ్యం పథకాల ద్వారా నెలకు 20 వేల మెట్రిక్ టన్నులు పేదలకు సరఫరా చేస్తున్నాయి. ప్రతి వ్యక్తికి ఐదు కిలోల చొప్పున కుటుంబంలో ఎంత మంది ఉంటే అందరికి లెక్కకట్టి రాయితీ బియ్యం ఇస్తున్నారు. ఈ లెక్కన రేషన్ బియ్యం రూపంలో ప్రభుత్వ ఖజానాపై నెలకు రూ.83 కోట్లకు పైగా భారం పడుతోంది. భారమైనా సరే సామాన్యులకు ఆహార భద్రత కల్పించాలనే లక్ష్యంగా ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యం అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. గత వైసీపీ ప్రభుత్వంలో బియ్యం మాఫియా పెట్రేగిపోతే.. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా బియ్యం దందా ఆగడం లేదు. పార్టీ జెండాలు.. మాఫియాకు నాయకత్వం వహించే డాన్‌లు మారారు. గత వైసీపీ హయాంలో రేషన్ బియ్యం మాఫియా రూ.కోట్లకు పడగలెత్తారు అంటే ఏ స్థాయిలో అక్రమ రవాణా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. తామేం తక్కువా అంటూ కూటమి ప్రభుత్వంలోనూ రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిస్తున్నారు. అధికార కూటమి నాయకుల అండదండలు ఉండడంతో నిఘా అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారనే ఆరోపణలు లేకపోలేదు.



సెప్టెంబరు 8న తుగ్గలి మండలం జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యం లారీని సీజ్ చేసిన పోలీసులు

కిలోకు ప్రభుత్వానికి రూ.46 ఖర్చు

వరి ధాన్యం పండించే రైతులకు భరోసా.. పేదలకు ఆకలి తీర్చి ఆహార భద్రత కల్పించాలనే లక్ష్యంగా ధాన్యం కొనుగోలు, మిల్లు ఆడించడం, రవాణా, గోదాముల బాడుగ.. ఇలా వివిధ రూపాల్లో కార్డుదారుడికి అందించేసరికి కిలోకు రూ.46 ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో 20,501 మెట్రిక్ టన్నులు కోటా ఉంటే 90 శాతం 18 వేల టన్నులు పేదలకు ఇస్తున్నట్లు పౌర సరఫరా అధికారులు తెలిపారు. నెలకు రూ.83-85 కోట్లు చొప్పున ఏడాదికి రూ.వెయ్యి కోట్లకు పైగా ప్రభుత్వంపై భారం పడుతోంది. ఐదుగురు సభ్యుల కుటుంబానికి 25 కిలోలకు రూ.1,150 బియ్యం రాయితీ ఇస్తున్నారు. కార్డుదారుడి నుంచి మధ్య దళారులు కిలో రూ.10-12లకు సేకరిస్తే వారి నుంచి మాఫియా కిలో రూ.16-18లకు సేకరించి సరిహద్దులు దాటించి కర్ణాటకలో కిలో రూ.25-28కు విక్రయిస్తున్నారు.

మిగతా 8లో..

హైకోర్టుకు రామ్‌కో సిమెంట్ భూముల వ్యవహారం

రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన వైనం

కొలిమిగుండ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల మండలం కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమకు కేటాయించిన అసైన్డ్ భూముల వ్యవహారం హైకోర్టుకు చేరింది. దీంతో ఈ అంశం రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. పేదలకు పంపిణీ చేసిన 1926 ఎకరాల అసైన్డ్ భూమిని నిబంధనలకు విరుద్ధంగా గత వైసీపీ ప్రభుత్వం రామ్‌కో సిమెంట్ పరిశ్రమకు కేటాయించిందంటూ కొలిమిగుండ్ల మండలానికి చెందిన చెన్నప్ప అనే వ్యక్తి ఏపీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీంతో విచారణ చేపట్టిన హైకోర్టు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా పరిగణిస్తూ కౌంటర్ దాఖలు చేయాలని పరిశ్రమ వర్గాలకు, జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కౌంటరు దాఖలుకు కోర్టు మూడు వారాలు గడువు ఇచ్చినట్లు పిటీషనర్ తెలిపారు. వాస్తవానికి 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రామ్‌కో సిమెంట్ పరిశ్రమకు వర్చువల్‌గా భూమి పూజ చేసి ప్రారంభించారు. నిర్మాణం పూర్తయిన తరువాత 2022లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రామ్‌కో పరిశ్రమను ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కల్వటాల గ్రామ రెవెన్యూ పరిధిలో పేదలకు పంపిణీ చేసిన 1926 ఎకరాల అసైన్డ్ భూములను పరిశ్రమకు బదలాయించింది. ఈ బదలాయింపు చట్టబద్ధంగా జరగలేదంటూ ఇప్పుడు కోర్టులో పిటీషన్ దాఖాలు కావడం గమనార్హం.



కొలిమిగుండ్ల సమీపంలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమ

రాత్రికి రాత్రే రికార్డులు మార్చేశారు

- గత వైసీపీ పాలనలో నాయకుల ఇష్టారాజ్యం
- రైతులను బెదిరించి తమ పేర్లపై రిజిస్ట్రేషన్లు
- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆరోపణలు
- పార్టీలకతీతంగా రైతుల సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

బనగానపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అధికారులను బెదిరించి రాత్రికి రాత్రే రెవెన్యూ రికార్డులు మార్చారని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యాగంటి పల్లెలో మీభూమి మీహక్కు పేరుతో జేసీ విష్ణుచరణ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. బీసీ మాట్లాడుతూ రైతులు సమర్పించిన భూ వివాదాలకు సంబంధించి అందించిన అర్జీలను 45 రోజుల్లో పరిష్కరించనున్నట్లు తెలిపారు. భూ వివాదాలను పరిష్కరించాలనే ఉద్దేశంతో ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. గత పాలనలో కాటసాని రామిరెడ్డి ఇంట్లో రెవెన్యూ శాఖకు చెందిన కంప్యూటర్ ఆపరేటర్లు పని చేశారంటే వారి పాలనను అర్థం చేసుకోవచ్చన్నారు. 70 శాతం రెవెన్యూ రికార్డులు తారుమారు చేశారని ఆరోపించారు. రైతులను బెదిరించి తమ పేర్లతో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని తెలిపారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దడానికి రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు, గ్రామస్థులు గ్రామ సోషల్ వెల్ఫేర్ అధికారి, గ్రామ సచివాలయ సిబ్బం, గ్రామ వైసీపీ నాయకుడిపై ఫిర్యాదులు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో నరసింహులు, జిల్లా డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, నియోజకవర్గం స్పెషల్ అధికారి రాంభూపాల్‌రెడ్డి, స్థానిక తహసీల్దారు నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు బండికుమార్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, దస్తగిరి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, బత్తుల బాలిరెడ్డి, బత్తుల గోపాల్‌రెడ్డి, కృష్ణానాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ



మహిళా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న మంత్రి బీసీ

నాగటూరు ఎత్తిపోతల పైప్ లీకేజీ



భారీగా లీకేజీ అవుతున్న నీరు

నందికొట్కూరు రూరల్ డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి) : నందికొట్కూరు మండలంలోని నాగటూరు వద్ద గల ఎత్తిపోతల పథకం 2వ స్టేజీ పైపు నుండి నీరు భారీగా లీకేజీ అవుతోంది. ఈ నీరు తిరిగి కృష్ణా నది బ్యాక్ వాటర్‌లో కలుస్తోంది. దీని వల్ల రైతుల పంట పొలాలకు వెళ్ల వలసిన నీరు వృథా అవుతోం ది. కరెంట్ బిల్లులు, నీటి కొరతతో రైతులు ఇబ్బందిపడుతోంటే అధికారులు మాత్రం ఎత్తిపోతల నిర్వహణను గాలికి వదిలేసి చోద్యం చూస్తున్నారు. గత కొన్ని రోజులుగా నీరు లీకేజీ అవుతోందని రైతులు చెబుతున్నారు. పోటీ పడి ఎత్తిపోతలపై పెత్తనం కోసం పదవులు దక్కించుకొన్న వారు గానీ, అధికారులు గానీ ఈ సమస్యను పట్టించుకోలేదని రైతులు విమర్శిస్తున్నారు. నీటి లీకేజీని అరికట్టి ఎత్తిపోతల పథకాన్ని సరైన రీతిలో నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

నిధులు లేవు : నారాయణ రెడ్డి, ఏఈ

నీరు లీకేజీ అవుతున్న విషయం వాస్తవమే. దానిని అరికట్టేందుకు నిధులు లేవు. ఎత్తిపోతల నిర్వహణ సిబ్బందికి కనీసం వేతనాలు కూడా ఇవ్వడం లేదు. ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకువెళ్తే... ఎవరం ఏమీ చేయలేమని అన్నారు. నిధులు వచ్చాక పనులు చేయిస్తాం.

ఉపాధి కల్పించేలా సాంకేతిక
ప్రాజెక్టుల రూపకల్పన
ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్-2024 వేడుకల్లో మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి 8

అపార్ ఆపసోపాలు
మహానందిలో మళ్లీ చిరుత సంచారం 9లో

శ్రీశైలంలో అక్కినేని నాగార్జున 8



కృతిహొయలు

ఉప్పెన సినిమాతో ఒక్కసారిగా టాలీవుడ్‌లో అలలా ఎగసిపడిన కృతిశెట్టి శుక్రవారం నంద్యాలలో సందడి చేసింది. నంద్యాల పట్టణంలోని ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమెను చూసేందుకు యువకులు ఎగబడ్డారు. షాపింగ్ మాల్ ప్రారంభంలో పాల్గొన్న ఆమె కాసేపు అభిమానులతో మాట్లాడారు. డాన్స్ చేసి యువతను ఉర్రూతలూగించారు. అభిమానుల కోరిక మేరకు ఆమె సెల్ఫీ ఫొటో దిగి అందర్నీ హుషారెత్తించారు.

- నంద్యాల రూరల్

పేరెంట్స్ మీటింగ్‌కు రండి..!



విద్యార్థులు తయారు చేసిన ఆహ్వాన పత్రికలు





ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు అందజేస్తున్న దృశ్యం



- అదిరిపోయేలా ఆహ్వాన పత్రికలు
- విభిన్న ఆకృతుల్లో విద్యార్థుల సృజన

ఆత్మకూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నేటితరం విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాల్లో కూడా ప్రతిభ చాటుకుంటున్నారు. సృజనాత్మకతకు మరింత పదునుపెట్టి అద్భుతాలు సృష్టిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తమలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీశారు. శనివారం తమ పాఠశాలలో జరిగే మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌కు సంబంధించి తమ తల్లిదండ్రులకు, పూర్వ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఆహ్వానం అందించేలా వారే స్వయంగా ఆహ్వాన పత్రికలను తీర్చిదిద్దారు. ఎవరికి వారు తమ ఆలోచనలకు తగ్గట్టుగా వివిధ ఆకృతుల్లో రూపొందించిన ఆహ్వాన పత్రికలు అందరిని ఆకట్టుకున్నాయి. పెన్సిల్, పుస్తకం, పుష్పం, సీతాకోకచిలుకలు తదితర విధాలుగా సుమారు 20రకాలుగా తయారు చేసిన ఆహ్వాన పత్రికలు అందరినీ ఆకట్టుకున్నాయి. బయట వివిధ ఆకృతుల్లో కనిపించినప్పటికి తెరిచి చూస్తే లోపల చక్కటి ఆహ్వాన సందేశాన్ని అద్భుతంగా పొందుపరిచారు. వీటినే పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థుల తల్లిదండ్రులకు, పలువురు అధికారులకు, ప్రజాప్రతినిధులకు అందజేసి తమ పాఠశాలలో జరిగే మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌కు హాజరు కావాలని ఆహ్వానం పలికారు. శుక్రవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి సైతం ఇదే ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించగా ఆయన విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులదే ఆలోచన



తమ పాఠశాలలో జరిగే మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా జరుపుకోవాలని భావించాం. ఇందులో భాగంగా తల్లిదండ్రులకు, పూర్వవిద్యార్థులకు, ప్రముఖులకు ఆహ్వాన పత్రికలను అందజేయాలని ఆలోచించాం. అయితే వీటిని బయట ప్రింటింగ్ ప్రెస్‌ల్లో కాకుండా విద్యార్థులతో స్వయంగా తయారు చేయిస్తే వారిలో సృజనాత్మకత పెరగడంతో పాటు ప్రత్యేకంగా ఉంటుందని విద్యార్థులకు సూచించాం. దీంతో విద్యార్థులు పోటీ పడి వివిధ ఆకృతులతో కూడిన ఆహ్వాన పత్రికలను తయారు చేశారు. ఇవే ఆహ్వాన పత్రికలను పలువురు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఇవ్వగా వారు సైతం ఆశ్చర్యానికి లోనయ్యారు. చిన్నారులు ఇచ్చిన ఆహ్వాన పత్రికలను అందరూ భద్రపర్చుకోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది.

- నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆత్మకూరు

పెళ్లికి రావాలని ప్రధాని మోదీకి ఆహ్వానం

కర్నూలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి తన కూతురు వివాహానికి రావాలని మంత్రి టీజీ భరత్ శుక్రవారం కోరారు. ఈ నెల 26న తన కుమార్తె టీజీ శ్రీఆర్యపాన్య, బొమ్మిడాల వెంకటశ్రీ నలిన్‌ల వివాహానికి హాజరై ఆశీర్వాదించాలని కోరుతూ ప్రధానికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 26న గురువారం శంషాబాద్ విమానాశ్రయం సమీపంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో టీజీ శ్రీఆర్యపాన్య, బొమ్మిడాల వెంకటశ్రీ నలిన్‌ల వివాహం జరగనుంది.



ప్రధానమంత్రి నరేంద్రమోదీకి పెళ్లి కార్డు అందజేస్తున్న మంత్రి టీజీ భరత్

పడిపోయిన ఉల్లి ధర



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ కమిటీ యార్డులో గతంలో ఎన్నడూ లేని విధంగా కనిష్ఠ ధర శుక్రవారం రైతులకు అందింది. ఇప్పటి దాకా కొన్ని సంవత్సరాలుగా 200 నుంచి రూ.400 మాత్రమే కనిష్ఠ ధర రైతులకు అందింది. శుక్రవారం ఏకంగా క్వింటానికి రూ.2,519 దక్కడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, సెక్రటరీలు వెంకటేశ్వర్లు, రెహమాన్ తెలిపారు.

మల్లన్న సన్నిధిలో హీరో నాగార్జున కుటుంబం



ఆలయ ప్రాంగణంలో సినీ హీరో నాగార్జున, నాగచైతన్య, శోభిత

శ్రీశైలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శుక్రవారం సినీ హీరో అక్కినేని నాగార్జున కుటుంబం దర్శించుకుంది. నాగార్జునతో పాటు కుమారుడు నాగచైతన్య, కోడలు శోభితతో కలిసి దర్శించు కున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వీరికి ఆలయ అధికా రులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరు మల్లికార్జున స్వామివారికి అభిషేకం నిర్వహించి, భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు జరిపించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వీరికి ఆలయ అర్చకులు, వేదపండి తులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసా దాలను అందజేశారు. అభిమానులతో నాగార్జున ఫొటోలు దిగి సందడి చేశారు.

కలెక్టర్‌ను కలిసిన శ్రీశైలం ఈవో



కలెక్టర్ రాజకుమారికి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

శ్రీశైలం/నంద్యాల కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారి డిప్యూటీ కలెక్టర్ ఎం. శ్రీనివాసరావు శుక్రవారం కలెక్టర్ రాజకుమారిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈవో ఎం. శ్రీనివాసరావు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని బహూకరించి ప్రసాదాలు అందజేశారు. అలాగే ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జేసీ విష్ణుచరణ్‌ను కలిశారు.

ఉపాధి కల్పించేలా సాంకేతిక ప్రాజెక్టుల రూపకల్పన

- ప్రతిభ వెలికి తీయడానికే ఈటెక్ ఫెస్ట్
- ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్-2024 వేడుకల్లో మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 06 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ఉపాధి కల్పించేలా సాంకేతిక ఆవిష్కరణలు రూపొందించాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్-2024 వేడుకల్లో మంత్రి ఫరూక్‌తో పాటు కలెక్టర్ రాజకుమారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ విద్యార్థులలో అణగారిన ప్రతిభ వెలికి తీయడానికి ఈటెక్ ఫెస్ట్ దోహదపడుతుందన్నారు. ఈటెక్ ఫెస్ట్‌లో 12 పాలిటెక్నిక్ కాలేజీల నుంచి 96 ప్రాజెక్టులపై 324 మంది విద్యార్థులు ఆవిష్కరణలు ప్రదర్శించారని అన్నారు. సాంకేతిక విద్యను ప్రోత్సహించడం ద్వారా టెక్స్‌టైల్ పార్కులు, లెదర్‌పార్కులు, వ్యవసాయ ఉత్పత్తులు, తదతర రంగాలలో అభివృద్ధి చెందడంతో పాటు ఉత్పాదక పెరిగి వృద్ధి రేటు సాధ్యమవుతుందన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ సమాజంలో జీవన ప్రమాణాలు పెంచే దిశలో సాంకేతిక ప్రాజెక్టుల ఆవిష్కరణలు ఉండాలన్నారు. పోటీ ప్రపంచంలో నెగ్గాలంటే ప్రతి అంశాన్ని సవాలుగా తీసుకోవాలని అన్నారు. ఎస్‌వీయూ రీజనల్ జాయింట్ డైరక్టర్ నిర్మల్‌కుమార్ ప్రియా మాట్లాడుతూ ఈటెక్ ఫెస్ట్ పుస్తక జ్ఞానాన్ని నిజ జీవితానికి ఎలా అన్వయించుకోవాలో విద్యార్థులకు తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజల్వన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, కలెక్టర్, ఎస్‌వీయూ రీజనల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్‌కుమార్ ప్రియా, తదితరులు

9న రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

నంద్యాల కల్చరల్, డిసెంబరు 06 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9వ తేదీన ఉదయం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మౌలానా ముస్తాక్ అహ్మద్ మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తనను రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించినందులకు కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రి నారా లోకేశ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్నమౌలానా ముస్తాక్ అహ్మద్

హద్దులు దాటి ఆదాయం

(7వ పేజీ తరువాయి)



కనిపించని కుంభకోణం ఇది!

జిల్లాలో కర్నూలు సోనా, నంద్యాల సోనా బియ్యం సాగుకు ప్రసిద్ధి. సామాన్యులు సైతం సన్నరకం సోనా బియ్యానికి అలవాటు పడ్డారు. రేషన్ బియ్యానికి దోసెలకు మాత్రమే వాడుతున్నారు. మిగిలిన 35 శాతానికి పైగా మాఫియా పంపించే దళారులకు అమ్మేస్తున్నారు. నెలనెలా దాదాపుగా రూ.20-25 కోట్లకు పైగా విలువైన రేషన్ బియ్యం కర్ణాటకకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. చాప కింద నీరులా విస్తరిస్తున్న కనిపించని కుంభకోణం ఇది. కర్ణాటక నుంచి మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లోని మద్యం తయారీ పరిశ్రమలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

ఎండీయూ వాహనాల్లో కొనుగోలు

జిల్లా కేంద్రం కర్నూలు, ఆదోని సహా వివిధ ప్రాంతాల్లో పలువురు ఎండీయూ వాహన ఆపరేటర్లే బియ్యం బదులు కిలోకు రూ.10 లెక్కకట్టి ఇస్తున్నారు. కొందరు మహిళలు ఇంటింటికి వెళ్లి సేకరిస్తున్నారు. అలా సేకరించే బియ్యాన్ని అర్ధరాత్రి మాఫియా పంపించే ఆటోలలో చెప్పిన ప్రదేశానికి చేరవేస్తారు. ఆటోల్లో తీసుకొచ్చిన బియ్యాన్ని ఓ లారీలో లోడ్ చేసి.. ఇద్దరు మోటార్‌బైక్‌లపై పైలెట్‌గా వెళితే వారి కనుసన్నల్లో బియ్యం లారీలు సరిహద్దులు దాటుతన్నాయి.లారీకి రూ.లక్ష వరకు లాభం ఉంటుందని సమాచారం.

అంతటా రేషన్ బియ్యం మాఫియా

- కర్నూలు నగరంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాలో బుధవారపేట, ఓల్డ్ టౌన్‌లో ఉంటున్న ఇద్దరు బియ్యం డాన్‌లదే రాజ్యమని తెలుస్తోంది. కొందరు రేషన్ డీలర్లు, ఎండీయూ వాహన ఆపరేటర్లు మిగిల్చిన బియ్యం, దళారులు ఇంటింటికి వెళ్లి సేకరించిన రేషన్ బియ్యాన్ని రహస్య గోదాములకు తరలిస్తారు. అక్కడి నుంచి రాత్రివేళ్లలో తుంగభద్ర నది దాటించి కర్ణాటకకు చేరుస్తున్నారు. వైసీపీ హయాంలోనూ.. టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలోనూ వారే హవా కొనసాగిస్తున్నారు.
- ఆదోనిలో వైసీపీ హయాంలో చిన్న బాస్ కనుసన్నల్లో రేషన్ అక్రమ రవాణా సాగిస్తే.. తాజాగా బీజేపీ మాస్క్ వేసుకున్న మాజీ వైసీపీ యువ నాయకుడు రేషన్ బియ్యం డాన్ అవతారమెత్తాడు. ఊరూ వాడా తనదే అంటూ దళారులను పెట్టి సేకరించిన రేషన్ బియ్యంను అర్ధరాత్రి ఆటోల్లో ఆస్పరి రహదారిలోని రహస్య గోడౌన్‌కు చేర్చుతున్నాడు. అక్కడ లారీల్లో లోడ్ చేసి సరిహద్దులు దాటిస్తున్నాడు. ఈ బియ్యాన్ని కర్ణాటకలోని సిరిగుప్ప, రాయచూరు పట్టణాలకు చేరుస్తున్నారని సమాచారం. కొంత బియ్యం రైస్ మిల్లర్ల నుంచి నకిలీ వేబిల్లులు తీసుకొని నేరుగా కాకినాడ పోర్టుకు రవాణా చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.
- ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో పత్తికొండ, డోన్‌కు చెందిన బియ్యం డాన్‌లుగా అవతారమెత్తిన అక్రమార్కులు ఇంటింటా బియ్యం సేకరణ, డీలర్లు వద్ద మిగలిన బియ్యం సేకరించి ఆదోని, డోన్ పట్టణాలకు చేరుస్తున్నట్లు తెలుస్తోంది. డోన్ నుంచి నంద్యాలకు చేర్చి అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు చేరవేస్తున్నారనే సమాచారం. కోడుమూరులో సైతం బియ్యం మాఫియా రెచ్చిపోతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పిన మాఫియానే కూటమి ప్రభుత్వంలోనూ రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో కర్ణాటక సరిహద్దుల్లో ఉండడంతో నిఘా కళ్లకు చిక్కకుండా సరిహద్దులు దాటిస్తున్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టాం

పేదలకు ఇచ్చే రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాం. పలు ప్రాంతాల్లో ఎండీయూ వాహన ఆపరేటర్లే బియ్యానికి బదులుగా నగదు ఇస్తున్నారనే వస్తున్నాయి. వారిపై కూడా నిఘా పెట్టాం. ఏ గ్రామంలోనైనా రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నా అక్రమంగా నిల్వ చేసినా జిల్లా పౌర సరఫరాల అధికారులకు సమాచారం ఇస్తే తక్షణమే స్పందించి దాడులు చేస్తాం. సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతాం.

- రఘువీర్, కర్నూలు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

ఉమ్మడి జిల్లాలో రేషన్ కార్డులు, బియ్యం కోటా వివరాలు

వివరాలు	కర్నూలు	నంద్యాల	మొత్తం
రేషన్ షాపులు	1,233	1,204	2,4347
ఎండీయూ వాహనాలు	409	352	761
రేషన్ కార్డుదారులు	6,76,206	5,41,804	12,18,010
బియ్యం కోటా నెలకు	11,845	8,655	20,500 (టన్నులు)

'మహనీయుడు అంబేడ్కర్'

బనగానపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహనీయుడని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బనగానపల్లె మండలంలోని యాగంటిపల్లెలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రితో పాటు జేసీ విష్ణుచరణ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ గొప్ప సాంఘిక సంస్కర్త అని మంత్రి బీసీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో డోన్ ఆర్డీవో నరసింహులు, జిల్లా డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, నియోజకవర్గం స్పెషల్ అధికారి రాంభూపాల్‌రెడ్డి, తహసీల్దారు నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి బీసీ

డాక్టర్ హరికిషన్‌కు మంగాదేవి పురస్కారం



కర్నూలు కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త, కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్‌కు 'మంగాదేవి బాల సాహిత్య పురస్కారం' ఈనెల 10న అందజేయనున్నారు. గుంటూరులోని వెంకటేశ్వర బాలకుటీర్ సంస్థ ఆధ్వర్యంలో ఏటా సాహిత్యంలో వివిధ అంశాల్లో సేవలు అందిస్తున్న ప్రముఖులకు ఈ పురస్కారం, రూ.25 వేల నగదు పారితోషికం అందిస్తున్నారు. కాగా ఈ ఏడాదికి గాను బాల సాహిత్యంలో విశేష కృషి చేస్తూ, యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియాల ద్వారా బాలసాహిత్యాన్ని తెలుగు సాహితీ ప్రపంచానికి అందిస్తున్న డాక్టర్ ఎం. హరికిషన్‌ను ఎంపిక చేశారు. 10న గుంటూరులో ఇస్కాన్ టెంపుల్ రోడ్డులోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో జరిగే బాలకుటీర్ 27వ లలితకళా ఉత్సవంలో, కేంద్ర సాహిత్య అకాడమీ భాషా సమ్మాన్ పురస్కార గ్రహీత ఆచార్య బేతవోలు రామబ్రహ్మం చేతుల మీదుగా ఈ పురస్కారం అందజేస్తున్నామని సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ ఎన్. మంగాదేవి తెలిపారు.

డీపీఆర్‌సీలో ముగిసిన శిక్షణ

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ నిధులతో స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై డీపీఆర్‌సీలో జరిగిన రెండు రోజుల శిక్షణ శుక్రవారం ముగిసింది. ప్రతి మండలం నుంచి ఈఓఆర్డీ/పంచాయతీ కార్యదర్శి, ఎంపీహెచ్ఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పీఆర్ ఏఈ, ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హాజరయ్యారు. ఒక్కో మండలం నుంచి 6 మంది బ్లాక్‌లెవెల్ మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారు ఈ నెల 10 నుంచి 13 వరకు ఆయా మండలాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఇతర లైన్ డిపార్ట్‌మెంటు అధికారులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సీఈఓ నాసరరెడ్డి తెలిపారు.

ఉద్యోగుల వివరాలు ఇవ్వండి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగర పాలక, మున్సిపాలిటీలలో అనధికారికంగా సెలవు పెట్టిన ఉద్యోగుల వివరాలను అందజేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ విశ్వనాథ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా సెలవులో వెళ్లిన ఉద్యోగుల వివరాలను ఒక ఫార్మెట్‌లో ఇవ్వాలని పేర్కొన్నారు.


విశ్వకర్మ పథకాన్ని వినియోగించుకోవాలి

లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్ఆర్ రామచంద్రరావు



మాట్లాడుతున్న లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్ఆర్ రామచంద్రరావు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న విశ్వకర్మ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్ఆర్ రామచంద్రరావు తెలిపారు. శుక్రవారం స్థానిక బీసీ భవన్‌లో విశ్వకర్మ స్కీంపై రాజకీయ పార్టీలకతీతంగా అవగాహన సదస్సును దేవపూజ ధనుంజయ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ విశ్వకర్మ పథకం ద్వారా రుణం పొంది అభివృద్ధి చెందాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారు అర్హులు అన్నారు. విశ్వకర్మ పథకానికి ఎన్నికైన వారు బ్యాంకు ద్వారా ఈ రుణాలు పొంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ స్కీంలో వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, రాతి శిల్పి, చెప్పులు కుట్టేవారు, బొమ్మలు తయారు చేసేవారు, మంగలి వృత్తి వారు ఈ పథకానికి దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. రుణ సౌకర్యం రూ.10 లక్షలలోపు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ఏపీవో హరి, కర్నూలు పట్టణ ప్రాజెక్టు అధికారి వెంకటలక్ష్మి, మెప్మా అధికారి భాస్కర్ రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళీనాయుడు, బీసీ నాయకులు శ్రీరాములు యాదవ్, బెస్త ఈరన్న, అయ్యన్న యాదవ్ పాల్గొన్నారు.



అపార్ ఆపసోపాలు

విద్యార్థుల వ్యక్తిగత వివరాల్లో తేడాలు

ఆధార్‌లో ఒకలా.. రికార్డులో మరోలా

ఒత్తిడి గురవుతున్న ఉపాధ్యాయులు



ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి జాతీయ స్థాయిలో ఒక జీవితకాల గుర్తింపు కార్డు జారీ చేయాలని కేంద్రం సూచించింది. అందులో భాగంగా ఆటోమేటిక్ పర్మనెంట్ అకౌంట్ రిజిస్ట్రే(అపార్) 12 అంకెలు కూడిన కార్డును జారీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే పాఠశాలలో అపార్ జారీకి ఉపాధ్యాయులు ఆపసోపాలకు గురవుతున్నారు. విద్యార్థుల వ్యక్తిగత వివరాలలో తేడాలు ఉండడంతో తలలు పట్టుకుంటున్నారు. విద్యార్థుల ఆధార్ కార్డులో ఒకలా.. స్కూలు రికార్డులో మరోలా ఉండడంతో అపార్ నమోదుకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఓ వైపు విద్యాశాఖ ఒత్తిడి చేస్తుండడంతో విద్యార్థులు ఆధార్ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. ఆధార్ కేంద్రాల్లోనూ సరైన ఆధారాలు లేవని వెనక్కి పంపిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ఆదోని నియోజకవర్గంలో 274 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 64,870 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ అపార్ జారీ చేయాలని ప్రభుత్వం సూచించింది. అందుకు ఉపాధ్యాయులు విద్యార్థుల స్కూలు రికార్డులను బట్టి ప్రభుత్వం పెట్టిన ప్రత్యేకమైన యాప్‌లోవారి వివరాలను నమోదు చేస్తున్నారు. చాలా మంది విద్యార్థుల వివరాల్లో తేడాలు ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఓ వైపు సాంకేతిక సమస్య.. మరోవైపు జిల్లా విద్యాశాఖ అధికారులు త్వరగా పూర్తి చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటి వరకు 47,934 మంది విద్యార్థులకు మాత్రమే అపార్ నమోదు చేశామని చెప్పుతున్నారు. 74 శాతం పూర్తయిందని అధికారులు పేర్కొంటున్నారు.

- ఆర్‌ఆర్‌లేబర్ కాలనీలోని పాఠశాలలో 954 మంది విద్యార్థులు చదువుతుండగా ఇప్పటి వరకు 550 మంది విద్యార్థులకు అపార్ నమోదు చేశారు. కొంతమంది విద్యార్థుల ఇంటి పేర్లు, పుట్టిన తేదీలు తల్లిదండ్రుల ఆధార్‌లో వేరేలా ఉండడం వల్ల 58 శాతం మాత్రమే పూర్తయింది.
- నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో 1850 మంది చదువుతుండగా 1500 మంది విద్యార్థుకు అపార్ నమోదు చేశారు.
- మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1600మంది విద్యార్థులు చదువుతుండగా 1450 మందికిపైగా విద్యార్థులకు అపార్ జారీ చేశారు. మిగతా విద్యార్థులు వారి వివరాలు తప్పుగా ఉండడంతో సరి చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు.


ఆర్‌ఆర్ లేబర్ కాలనీలో అపార్ కోసం వివరాలను నమోదు చేసుకుంటున్న విద్యార్థులు

ప్రతి విద్యార్థికి అపార్ జారీ : శ్రీనివాసులు, ఎంఈవో ఆదోని



పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి అపార్ జారీ చేయాలని ప్రభుత్వం సూచించింది. ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సరి చేసుకునే అవకాశం కూడా కల్పించింది. విద్యార్థికి జీవిత కాలం ఒకే నెంబర్ ఉండేలా జారీ చేసిన కార్డు. ఉపాధ్యాయులు త్వరగా విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మరొకరికి గాయాలు



ప్యాపిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాంపల్లి చెరువు దగ్గర 44వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి గాయాలయ్యాయి. మండలంలోని పెద్దపూదిళ్ల గ్రామానికి చెందిన రాజు(20), అరవిందు స్నేహితులు కలిసి పని నిమిత్తం బైకుపై డోన్‌కు వెళ్లారు. అక్కడ పని పూర్తి కాగానే తిరిగి పెద్దపూదిళ్లకు బయలుదేరారు. మార్గం మధ్యలోని వెంగళాంపల్లి చెరువు దగ్గరకు రాగానే అదుపు తప్పి బైకు బోల్తా పడింది. ఈ ఘటనలో రాజు అక్కడికక్కడే మృతి చెందగా అరవిందుకు గాయాలయ్యాయి. మృతుడి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పారిశ్రామిక అభివృద్ధికి సహకారం

కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్



సమావేశంలో పాల్గొన్న బ్యాంకు అధికారులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా పారిశ్రామికాభివృద్ధికి కెనరా బ్యాంకు సహకారం ఉంటుందని ఆ బ్యాంకు రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎ.క్యాంపు మాంటిస్సోరి స్కూల్‌కు సమీపంలోని ఉద్యమి భవన్‌లో కెనరా బ్యాంకు రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరగతి పరిశ్రమల స్థాపనకు సంబంధించిన రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎం సుశాంత్ కుమార్ మాట్లాడుతూ కెనరా బ్యాంకు 54 శాఖలతో కర్నూలు జిల్లాలో విస్తృత సేవలు అందించడమే కాకుండా, ఎంఎస్‌ఎంఈ రంగానికి రుణాలు అందించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. వ్యవసాయ రంగానికి ప్రత్యేక రుణాలు, రైతులకు అవసరమైన పెట్టుబడుల కోసం ప్రత్యేక పథకాలు కూడా అందుబాటులో ఉన్నాయని అన్నారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు రామచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎంఎస్‌ఎంఈ రుణాలను వినియోగించుకొని తమ వ్యాపార అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ సులభ్ కార్యాలయం అధికారులు రమేష్ ప్రభు, రీజిల్ కార్యాలయం అధికారి జి. నరేష్, బ్యాంకు సీనియర్ మేనేజర్లు, ఇతర బ్యాంకుల అధికారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు ప్రశంసనీయం

ఎస్పీ జి. బిందుమాధవ్ ● ఘనంగా హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం




ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమాజసేవ, శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డుల సేవలు ప్రశంసనీయమని ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో 62వ హోంగార్డుల వ్యవస్థాపక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎస్పీ హోంగార్డుల నుంచి ప్లటూన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పరేడ్ పరిశీలన వాహనంపై వెళ్లి ప్లటూన్లను పరిశీలించారు. బెలూన్లు, కపోతాలను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే నేరుగా కలిసి విన్నవిస్తే పరిష్కరిస్తామన్నారు. క్రమశిక్షణతో మెలుగుతూ పోలీసు శాఖ ప్రతిష్ఠ పెంచేలా సమష్టిగా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్‌లో మంచి మార్కులు సాధించిన ఆరుగురు హోంగార్డు పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేశారు. అలాగే లాంగ్‌జంప్ షాట్‌పుట్, వంద మీటర్ల క్రీడల పోటీల్లో గెలుపొందిన హోంగార్డ్స్ విజేతలకు జిల్లా ఎస్పీ బహుమతులు ప్రధానం చేశారు. 33 మందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ ఎం.మహేష్ కుమార్, ఏఎస్పీలు హుశేన్‌పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు బాబు ప్రసాద్, ప్రసాద్, పోలీస్ వెల్ఫేర్ డాక్టర్ స్రవంతి, స్పెషల్ బ్రాంచ్ సీఐ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాలలో...

నంద్యాల క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం 62వ హోంగార్డు దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆయన హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సేవలందించిన హోంగార్డులను ఎస్పీ అభినందించారు. అనంతరం హోంగార్డులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు ఎన్.యుగంధర్‌బాబు, చంద్రబాబు, డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో మళ్లీ చిరుత సంచారం


ఆలయ పరిసరాల్లో చిరుత

మహానంది, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహానంది సమీపంలో మళ్లీ చిరుత పులి సంచరించడంతో భక్తులు, స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. కొంత కాలం నుంచి చిరుతపులి సంచారం లేకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత దైవ దర్శనం కోసం వచ్చిన అయ్యప్ప భక్త బృందంలోని కొందరు కాల కృత్యాలు తీర్చుకునేందుకు ఆలయం వెనుక వైపునకు వెళ్లారు. చిరుతపులి సంచరించడం గమనించి కేకలు వేస్తూ పరుగులు తీశారు. అలాగే మహానంది పరిసరాల్లోని పార్వతీపురం శివారు వైపు కూడా చిరుత అర్ధరాత్రి సంచరించినట్లు స్థానికులు తెలిపారు. కొన్ని నెలల నుంచి చిరుతపులి కదలికలు మహానంది ఆలయ పరిసరాల్లో లేకపోవడంతో ప్రశాంతంగా ఉన్న స్థానికులు మళ్లీ చిరుత సంచారంతో ఆందోళన చెందుతున్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో శ్రీశైలం ఈవో


ఈవో శ్రీనివాసరావును ఆలయ మర్యాదలతో సత్కరిస్తున్న అర్చకులు, అధికారులు

మహానంది, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శ్రీశైలం ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఈవోకు ఆలయం వద్ద వీరికి అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఈవో స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకార్చనలను జరిపారు. కల్యాణ మంటపంలో వేదపండితులు, ప్రధాన అర్చకుడు మామిళ్ళపల్లి అర్జునశర్మ ఈవోను శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట శ్రీశైలం పీఆర్వో టి.శ్రీనివాసరావు, మహానంది ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి, సిబ్బంది నీలకంఠరాజు, నాగమల్లయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందజేస్తాం -ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యమని రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం కడప సీనియర్ నాయకులు పుత్త నరసింహారెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణచైతన్యరెడ్డిలను వారి కార్యాలయాల్లో ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు అందించిన విత్తనాలు, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో రైతులకు అందిస్తున్న విత్తనాలు నాణ్యత, సరఫరాపై వారితో సుబ్బారెడ్డి చర్చించారు. అనంతరం వారి నుంచి పలు సలహాలు, సూచనలు తీసుకున్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో శ్యాముల్ పాల్ శుక్రవారం తెలిపారు. ఈ పరీక్ష 8వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించరని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3865 మంది హాజరు కానున్నారని తెలిపారు. రెండు డివిజన్‌లో 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రెండు స్క్వాడ్ బృందాలు, 18 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తారన్నారు.



వర్షంతో రైతుల గుండెల్లో గుబులు

మిడుతూరు మండలంలో కురుస్తున్న వర్షాలకు రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. వర్షాలకు తోరణాలు కట్టిన పొగాకు తడవకుండా కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. గాలి వాన కారణంగా తోరణాలపైన వేసిని పట్టలు లేచి పొగాకు తడిసి దెబ్బతిన్నట్లు రైతులు వాపోతున్నారు. -మిడుతూరు



రాజ్యాంగ నిర్మాతకు నివాళి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో మినీ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ రంజిత్ బాషా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సేవలను ఆయన కొనియాడారు. -కర్నూలు కలెక్టరేట్

కోసిగయ్య స్వామి గర్భగుడికి తాళం


ఆలయానికి వేసిన తాళాలు

కోసిగి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోసిగి గ్రామ దేవునిగా భక్తులతో పూజలందు కుంటున్న కోసిగయ్య (ఆంజనేయ)స్వామి ఆలయానికి కొందరు వ్యక్తులు తాళాలు వేయడంతో భక్తులు, పెళ్లి వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆలయంలో అర్చకునిగా పని చేస్తున్న పూజారి శ్రీరాములు, శ్రీనివాసులు ఎప్పటిలాగే తాళం తీయడానికి ఆలయానికి వచ్చారు. అయితే అదనంగా మరో తాళం ఆలయ గర్భగుడికి వేసి ఉండటంతో వారు కోసిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాళం వేసిన వారిలో గతంలో ఆలయ అర్చకులుగా పని చేసిన గోపాల్, ప్రసాద్ కుటుంబ సభ్యులే ఉన్నట్లు తెలిసింది. సమస్య ఉంటే కూర్చుని మాట్లాడుకోవాలిగాని తాళం వేయడం ఏమిటి అని భక్తులు మండిపడుతున్నారు.

కూటమి ప్రభుత్వంలోనే బ్రాహ్మణుల సంక్షేమం

కర్నూలు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని బ్రాహ్మణ సంక్షేమశాఖ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటరామరాజు అన్నారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది బడ్జెట్‌లో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు గతంలో ఇచ్చిన సబ్సిడి రుణాలతో పాటు విదేశీ విద్య, విద్యార్థులకు ఉపకార వేతనాలు తదితర సంక్షేమ పథకాల కోసం రూ. 270.61 కోట్ల నిధులు కేటాయించినందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి సవితకు బ్రాహ్మణుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో చాణక్య, కశ్యప, గాయత్రి, వశిష్ట, ద్రోణాచార్య, విదేశీ విద్యా పథకాలను పునరుద్ధరించి బ్రహ్మణులను ఆదుకోవాలని కోరారు.

సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

హాజరైన మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో అతిపెద్ద వస్త్ర వ్యాపార సంస్థ సీఎంఆర్ టెక్స్‌టైల్స్, జ్యూవెలరీ షాపింగ్ మాల్‌ను శుక్రవారం రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాలలో సీఎంఆర్ లాంటి షాపింగ్ లాంటి పెద్దమాల్స్ రావడంతో అభినందనీయమన్నారు. దీంతో నంద్యాల పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం సీఎంఆర్ ఫౌండర్, ఛైర్మన్ వెంకటరమణ మాట్లాడుతూ గత నాలుగు దశాబ్ధాలుగా సంస్థను రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. తమ 39వ షోరూంను నంద్యాలలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అన్ని రకాల వేడుకలకు తమ సంస్థలో వస్త్రాలు అతి తక్కువ ధరకే లభిస్తాయన్నారు. తమ సొంత మగ్గాలపై నేయించిన వస్త్రాలను మార్కెట్‌లో మరెవ్వరూ ఇవ్వనిధరలకు అందిస్తుందన్నారు. సీఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ సీఎంఆర్ అంటే ది వన్ స్టాప్ షాప్ అన్నారు. అన్ని రకాల వెరైటీలు, డిజైన్స్‌లు లభిస్తాయన్నారు. అందరికి అందుబాటు ధరలో లక్షలలో డిజైన్లు,వేలల్లో వెరైటీలు లభిస్తాయన్నారు. యువతరానికి నచ్చేవిధంగా వస్త్ర ఉత్పత్తులు ఉంటాయని తెలిపారు.


అభిమానులతో సెల్ఫీ తీసుకుంటున్న సినీనటి కృతిశెట్టి


షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్, మాల్ యాజమాన్యం

ప్రత్యేక ఆకర్షణగా సినీతార కృతిశెట్టి

సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో ప్రముఖ సినీనటి కృతిశెట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆమె షాపింగ్ మాల్‌లోని అన్ని సెక్షన్లు తిరిగి అన్ని రకాల వస్త్రాలను పరిశీలించారు. అన్ని రకాల వస్త్రాల క్వాలిటి చాలా బాగుందన్నారు. అభిమానులతో సెల్ఫీలు దిగి, డ్యాన్స్ చేసి అభిమానులను ఉర్రూతలూగించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి: మంత్రి బీసీ



ఆలమూరు రహదారిని పరిశీలిస్తున్న మంత్రి బీసీ

పాణ్యం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం అవసరమని రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఆలమూరు గ్రామంలోని ప్రధాన ఆర్అండ్‌బీ రహదారిని పరిశీలించారు. నంద్యాల, బనగానపల్లెకు వెళ్లే సమయంలో తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు చెప్పారు. దీంతో పాటు ప్రమాదకర మలుపు ఉండడంతో వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వర్షాకాలంలో మలుపులో నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడుతుందన్నారు. దీంతో రహదారికి ఆటంకంగా ఉండే అక్రమ కట్టడాలను స్వచ్ఛందంగా కూల్చివేసి రహదారికి ఆటంకం లేకుండా చేస్తున్నట్లు తెలిపారు. దీంతో మంత్రి ప్రజల సహకారానికి అభినందనలు తెలిపారు. త్వరలో ఈ రహదారిని మరింత అభివృద్ధిపరచి ప్రమాదాలు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామగోవిందరెడ్డి, చంద్రశేఖర్, గ్రామ ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'కఠినంగా శిక్షించాలి'

గడివేముల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడు ఏజాజ్ అహ్మద్ మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుడి మృతికి మండలంలోని గడిగరేవుల హైస్కూల్‌లో శుక్రవారం ఏపీటీఎఫ్ నాయకులు సంతాపం తెలియజేశారు. అనంతరం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలస్వామి, మానపాటి రవి, మునిస్వామి, కోమలమ్మ, చంద్రావతి, లక్ష్మీప్రసన్న, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

'బోధనకే పరిమితం చేయాలి'

ఆత్మకూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్, కార్యదర్శి జాకీర్‌హుసేన్ కోరారు. శుక్రవారం ఎంఈవో-1 బాలాజీనాయక్‌కు వారు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు శంకర్, శ్రీనివాసులు ఉన్నారు.

లింగ నిర్ధారణ నేరం: కలెక్టర్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నేరమని, అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'జయప్రదం చేయాలి'

ఆత్మకూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణ కోసం విజయవాడ నగరంలో జనవరి 5వ తేదిన జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభను జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు గరుడాద్రి సుదర్శన్, అత్తులూరి శ్రీధర్‌గుప్తా పిలుపునిచ్చారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని బ్రాహ్మణవీధిలో గల ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు వినోద్‌కుమార్, ఆవులరెడ్డి ఉన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



తుమ్మలూరులో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులోని పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రజాసంఘాల నాయకులు మల్లె ఎలీషా, చిలుక రాబిన్‌సన్‌రాజు, శేషు, దరగయ్య, చింతలయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

● ఆత్మకూరులోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. కేవీపీఎస్, గిరిజన సంఘం నాయకులు భాస్కర్, నరసింహ నాయక్ పాల్గొన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరులోని ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆర్టీసీ డిపోలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆర్టీసీ ఏడీసీ సుధాకర్, శ్రీనివాసులు, ఈకే సోమన్న, జీవి రత్నం, విజయుడు, రాజు, రంగన్న, గ్యారేజీ సెక్రటరీ శేషన్న, సురేష్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

● ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు మిడ్తూరు రోడ్డు సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లా అధ్యక్షుడు విజయుడు, నియోజకవర్గ అధ్యక్షులు ఈశ్వరయ్య పాల్గొన్నారు.



నందికొట్కూరులో..

పాములపాడు: పాములపాడులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బహుజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాలమహానాడు రాయలసీమ అధ్యక్షుడు అబ్రహాం, కలబండి అంకన్న, అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. సామాజికవేత్త డాక్టర్ నాగన్న, జాతీయ బీసీ సంఘం కార్యదర్శి బత్తుల సంజీవరాయుడు, జిల్లా కార్యదర్శి రఘురామ్మూర్తి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

● దళిత బలహీన వర్గాల వికాసానికి పాటు పడిన గొప్ప వ్యక్తి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శుక్రవారం తుమ్మలూరు గ్రామంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. టీడీపీ నాయకులు జ్యోతిరామలింగేశ్వర రెడ్డితో కలిసి ఆయన అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నేషనల్ హైవే పనుల్లో భాగంగా అంబేడ్కర్ విగ్రహం తొలగించంతో విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహిం చారు. టీడీపీ నాయకులు సర్పంచ్ వనమాల ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, రామకృష్ణ, సన్ని, జనార్దన్‌రెడ్డి, మధుకృష్ణ, గోవిందు, వెంకటేశ్వరరావు, హరినాథరెడ్డి, డప్పు వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో..

బండిఆత్మకూరు: ఎ.కోడూరులోని దళితవాడలో అంబేడ్కర్ విగ్రహానికి, అలాగే ఎస్సీ స్పెషల్ స్కూల్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సర్పంచ్ జ్ఞాణభరణం, సీఐటీయూ నాయకుడు డేవిడ్, సామాజిక కార్యకర్త నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాణ్యం: పాణ్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. మాలమహానాడు నాయకుడు దత్తు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లాల సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్, సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు పెరుగు శివకృష్ణ యాదవ్, బీసీ నాయకులు మద్దయ్య, మహేశ్, రంగనాయకులు, నాగరాజు, రాజేష్, రఫీ, సంజీవరాయుడు అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు. అలాగే గోనవరం, పాణ్యం టీడీపీ నాయకులు దానం, ఖాదర్‌బాషా, రమణమూర్తి, కృష్ణ, మహబూబ్‌బాషా, విద్యార్థి సంఘాల నాయకులు ప్రతాప్, సీఐటీయూ నాయకులు బాస్కర్, ప్రజా సంఘాల నాయకులు వెంకటాద్రి, పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు.



పాణ్యంలో..



బండిఆత్మకూరు: ఎ.కోడూరులో..

గర్భిణికి ఇన్‌స్పెక్టర్ రక్తదానం

నంద్యాల క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాలజిల్లా పోలీస్ కార్యాలయంలో పనిచేస్తున్న సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మారుతి శంకర్ శుక్రవారం ఓ గర్భిణి మహిళకు రక్తదానం చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో కాన్పు నిమిత్తం చేరిన గర్భిణి మహిళకు కాన్పు సమయంలో అకస్మాత్తుగా ప్లేట్లెట్లు పడిపోతుండటంతో అత్యవసరంగా రక్తం కావాల్సి వచ్చింది. ఇదే విషయాన్ని గర్భిణి బంధువులు ఇన్‌స్పెక్టర్ మారుతి శంకర్ దృష్టికి తెచ్చారు. దీంతో సీఐ హాస్పిటల్‌కు చేరుకొని మహిళకు రక్తదానం చేశారు. ఆపదలో రక్తదానం చేసి ఆదుకున్న ఇన్‌స్పెక్టర్ మారుతి శంకర్‌కు గర్భిణి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ నాయకులు అక్రమాలకు పాల్పడ్డారు

● ఆర్డీవోకు ప్రజల ఫిర్యాదు

నంద్యాల రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో కానాల గ్రామంలో 1.36 ఎకరాల అసైన్డ్ ల్యాండ్‌ను వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని హనీఫ్, లాయర్ బాబు, నాగరాజు ఆర్డీవో విశ్వనాథ్‌కు ఫిర్యాదు చేశారు. కానాలలో తహసీల్దార్ ప్రియదర్శిని ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈభూమి గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో దోభీఘాట్ల నిర్వహణకు కేటాయిచినట్లు తెలిపారు. అయితే వైసీపీ నాయకులు గత ప్రభుత్వంలో భూమిని ఆక్రమించి ఆన్‌లైన్ కూడా చేసుకున్నారని ఆరోపించారు. గతంలో అధికారులు చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదన్నారు. అంతేకాకుండా గ్రామంలోని నిరుపేదలకు జగనన్న పేరుతో ఇంటిస్థలాలు కేటాయించగా అందులోనూ బినామీ పేర్లతో వైసీపి నేతలు పట్టాలు పొంది ఒక్కొక్క పట్టా రూ.5 నుంచి రూ.6 లక్షల వరకు విక్రయించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. నియోజకవర్గ స్పెషల్ అధికారి కొండయ్య మాట్లాడుతూ ప్రతి రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలు అధికంగా వస్తున్నాయన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సర్పంచ్ బావమ్మ, ఎంపీడీవో సుగుణశ్రీ, రూరల్ డీటీ రామచంద్రయ్య, ఆర్ఐ నాగరాజు, ఈవోఆర్డీ శివనాగజ్యోతి, టీడీపీ నాయకులు రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

'సేవాగుణం అలవర్చుకోవాలి'

మహానంది, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి సూచించారు. వ్యవసాయ కళాశాలకు చెందిన ఎన్ ఎస్ఎస్ వలంటీర్లు గత వారం రోజుల నుంచి మహానంది మండలం అల్లీనగరం గ్రామంలో జాతీయ సేవా పథకంలో భాగంగా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. శుక్రవారం ముగింపు కార్యక్రమాన్ని కళాశాల ఎన్ఎస్ ఎస్ ఆఫీసర్లు అల్లీనగరంలో నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సారా పట్టివేత

నందికొట్కూరు రూరల్ డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూరు గ్రామంలో శుక్రవారం ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. సారా అమ్ముతున్న నీలి షికారి రాజేష్‌ను అదుపులోకి తీసుకుని 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతామన్నారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

కొత్తపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడంపై ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మెమోలు జారీ చేయాలని ఎంపీడీవో మేరీని ఆదేశించారు. శుక్రవారం కొత్తపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కిచ్చన్నగారి కుసుమలత అధ్యక్షత జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ అధికారులు సమావేశంలో కాకి లెక్కలు చెబితే.. వినేవారు లేరని అన్నారు. ముందుగా ఆయన కొత్తపల్లిలోని డా.బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి మండల ఉపాధ్యక్షుడు సింగారపు వెంకటరమణ(రంగ), మండల అధికారులు వారి శాఖల పురోగతిపై ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి: ఎస్పీ

నంద్యాల క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో పోలీస్ అధికారులతో గత (సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్) మూడు నెలల్లో జిల్లాలో నమోదైన కేసులపై నేర సమీక్షాసమావేశం నిర్వహించారు. ఎస్పీ ఆయా పోలీస్ స్టేషన్లవారీగా గత మూడు నెలల్లో జరిగిన ఎన్‌ఫోర్స్‌మెంట్, అవగాహన కార్యక్రమాలు, నేరాల నియంత్రణకు తీసుకున్న చర్యలు, నమోదైన కేసుల వివరాలు, కేసుల్లో రికవరీ తదితరాల గురించి ప్రతి నెలకు కంపారిటివ్ స్టేట్‌మెంట్ ఆధారంగా సమీక్షించారు. జిల్లాలో గత మూడు నెలల్లో జరిగిన ప్రాపర్టీ కేసుల్లో రికవరీ ఎలా చేయాలి, పెండింగ్‌లో ఉన్న కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దర్యాప్తు వేగవంతం చేసి రికవరీచేసేలా దిశానిర్దేశం చేశారు. అనంతరం వివిధ కేసుల్లో ప్రతిభ చూపిన పోలీస్ సిబ్బందికి నగదుతోపాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు, డీఎస్పీలు రవికుమార్, శ్రీనివాస్, రామంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో వైభవంగా ఊయల సేవ



స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయల సేవను వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహాగణపతి పూజను చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు దేవస్థానం విశేష పూజలు నిర్వహించింది.

యాజమాన్య పద్ధతులతో ప్రయోజనాలు: ఏడీఆర్

నంద్యాల రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే రైతన్నలకు మరిన్ని ప్రయోజనాలు కులుగుతాయని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థాన సహాయ సంచాలకుడు డాక్టర్ జాన్సన్ అన్నారు. శుక్రవారం నంద్యాలలోని ఆర్ఏఆర్ఎస్‌లో శిక్షణ, సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాన్సన్ మాట్లాడుతూ రైతన్నలు డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించుకోవడంతో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించుకోవచ్చని సూచించారు. ప్రత్తి మరియు, పొద్దుతిరుగుడు పంటల యాజమాన్య పద్ధతులలో పాటు, చీడ పీడలను నివారించే కొత్త క్రిమి సంహారక మందుల గురించి వివరించారు. అనంతరం డీఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ రబీ పంటలలో చీడ పీడలు లేకుండా ఉండేందుకు డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించుకోవాలని కోరారు. శనగ, మినుముకు సంబంధించి కొత్త రకాలు వచ్చాయని, వాటిని డిసెంబర్ మొదటి వారంలోపు విత్తుకోవాలని సూచించారు. డాక్టర్లు సుజాతమ్మ, ధనలక్ష్మి, రామవేంద్రచౌదరి, వెంకటరమణమ్మ, అశోక్‌కుమార్, రాదాకుమారి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ టాప్ అమర్చుకోవాలి: డీఈ

బండిఆత్మకూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులంతా ఇక సోలార్ టాప్‌లు అమర్చుకోవాలని నంద్యాల డీఈ సుబ్రమణ్యం, ఏఈ కంబగిరి సూచించారు. శుక్రవారం సాయంత్రం బండిఆత్మకూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యాఘర్ యోజన స్కీమ్ కింద సబ్సిడీతో ఈ అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. లబ్ధిదారులకు సోలార్ రూఫ్ టాప్‌లు 1 కిలో వాట్ యూనిట్ నెలకు 1200 యూనిట్లు ఉత్పత్తి, 2 కేవీ 2400 యూనిట్లు, 3కేవీ 3600 యూనిట్లు ఉత్పత్తి చేస్తాయన్నారు. వరుసగా 1 కేవీకి రూ.30 వేలు, 2 కేవీకి రూ.60 వేలు, 3 కేవీకి రూ.78 వేలు సబ్సిడీ ఇస్తుందని, మిగతా మొత్తాన్ని బ్యాంక్ ద్వారా రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎక్కువ ఉత్పత్తి అయిన యూనిట్లకు లబ్ధిదారులకు ఆరు నెలలకు ఒకసారి ఒకసారి యూనిట్‌కు రూ.2.90పైసల ప్రకారం నేరుగా లబ్ధిదారుల అకౌంట్‌కు జమ అవుతుందని చెప్పారు.

రైతులను మోసం చేస్తే చర్యలు: జేసీ

నంద్యాల కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులను మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని జేసీ విష్ణుచరణ్ హెచ్చరించారు. ఖరీఫ్‌సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యంను ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు 17తేమ శాతంతో నాణ్యత ప్రమాణాలు కలిగిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర సాధారణ రకం ఒక క్వింటాలుకు రూ2,300లకు, గ్రేడ్-ఎ రకం క్వింటాలు కు రూ.2320లకు రైతులు విక్రయించుకోవాలని జేసీ విష్ణుచరణ్ తెలిపారు. రైతులు తమ ధాన్యంను సమీపంలోని రైతు సేవాకేంద్రాలకు వెళ్లి తేమ శాతం నిర్ధారించుకోవాలన్నారు. జిల్లాలోని మిల్లర్లు ట్రేడర్లు నాణ్యత ప్రమాణాలు కలిగిన వరిధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులకు సహకరించారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసినవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహానందిలో పల్లకీ ఉత్సవం



పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

మహానంది, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీ ఉత్సవాన్ని ఆలయ వేదపండితులు వైభవంగా నిర్వహించారు. భక్తుల శివనామస్మరణ మధ్య ఆలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

12న రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్

నంద్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర చెస్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తు న్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డా.రవికృష్ణ, రామసుబ్బారెడ్డి శుక్రవారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 13ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. అండర్-12 కేటగిరీల్లో పోటీలు జరుగుతాయన్నారు. వయసు ధ్రువీకరణ పత్రాలతో పోటీలకు హాజరుకావాలన్నారు. ఈ నెల 8వ తేదీలోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9010451585నెంబరును సంప్రదించాలని కోరారు.

బాస్కెట్ బాల్ పోటీలకు ఆర్జీఎం విద్యార్థులు

పాణ్యం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ సీనియర్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆర్జీఎం విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరు 7వతేదీ నుంచి 11 వతేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా మారూ_రులో జరిగే రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలలో ఈసీఈ విద్యార్థిని తన్మయి, సీఎస్ఈ విద్యార్థినిలు నవ్య, జయశ్రీ, రాజేశ్వరి పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. స్పోర్ట్స్ డైరెక్టర్ వెంకటేశ్, వెంకటేశ్వరనాయక్, కన్వీనర్ గణేష్ పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి ఆర్థిక సాయం

నందికొట్కూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని మృతి చెందిన విద్యార్థిని అస్తమాహిన్ కుటుంబానికి 14వ వార్డు కౌన్సిలర్ మనపాటి అశోక్ రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం నాయకులు 11వ వార్డు ఇన్‌చార్జి రజని కుమార్‌రెడ్డి, 26వ వార్డు ఇన్‌చార్జి మండడి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ బాలిక కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావల్సిన ఆర్థిక సహాయం మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధ్యత కుటుంబాన్ని ఆదుకునేందుకు అన్ని చర్యలు చేపట్టారని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

రెవెన్యూ సదసుల్లో అధికారులు

గడివేముల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను పరిశీలించి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. మండలంలోని తిరుపాడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని అన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పొలాలకు వెళ్లే దారి సమస్యను పరిష్కరించాలని గ్రామానికి చెందిన కొందరు రైతులు కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. ఎస్సీ శ్మశానానికి స్థలం సరిపోవడం లేదని, మరికొంత స్థలం కేటాయించాలని, దారి సమస్య పరిష్కరించాలని ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన వినతులను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. తిరుపాడు గ్రామంలో పారిశుధ్య లోపంపై కలెక్టర్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగు నీరు నిల్వ ఉంటే వ్యాధులు వ్యాపించవా? అని ప్రశ్నించారు. పారిశుధ్య పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించడంపై అసహనం వ్యక్తం చేశారు. నియోజకవర్గ స్పెషల్ అధికారి ఉమామహేశ్వరమ్మ, మండల ప్రత్యేక అధికారి సుభాష్‌చంద్రబోస్, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో వాసుదేవగుప్తా, ఈవోఆర్డీ మహిధర్‌రెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు చేసిన తప్పిదాల వల్లనే ఎక్కడ చూసినా భూసమస్యలు వస్తున్నాయని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శుక్రవారం మండలంలోని దుద్యాల గ్రామ సచివాలయ ఆవరణలో తహసీల్దార్ ఉమారాణి అధ్యక్షతన గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దుద్యాల గ్రామంలో ఎన్నో ఎకరాలు ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని, వాటిని కూడా నిగ్గు తేలుస్తామని తెలిపారు. మండల ప్రత్యేక అధికారి చింతామణి, నాయకులు నారపురెడ్డి, లింగస్వామి గౌడు, మల్లారెడ్డి, జీఎండీ రఫీ, మన్సూర్ వలి, ఆయా గ్రామాల వీఆర్వోలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



దుద్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్: రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం నాగటూరు గ్రామంలో సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేశారు. తహసీల్దార్‌తో పాటు మండల ప్రత్యేక అధికారి డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. డీఐవోఎస్ ఉమాపతి, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ. మండల సర్వేయర్ త్యాగరాజు, వీఆర్వోలు స్వాములు, వెంకటేశ్వర్లు, స్వామన్న, ఆనంద్, సురేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మిడుతూరు: వీపనగండ్ల గ్రామంలో రెవెన్యూ సదస్సు వీఆర్వో రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసులు హాజరయ్యారు. ఆర్ఐ జహంగీర్ బాషా, సర్వేయర్ కృష్ణుడు, టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, మనోహర్‌రెడ్డి, వీఆర్వోలు సోఫిసాహేబ్, ఖాజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తిరుపాడులో కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలంలోని ఆయా రెవెన్యూ గ్రామాల్లో రైతులకు సంబంధించిన భూసమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల డిసెంబర్ 6 నుండి జనవరి 8వ తేది వరకు అన్ని గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ప్రత్యేకాధికారి కే.సుధారాణి, తహశీల్దార్ రత్నరాధిక పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు మండలంలోని ఇందిరేశ్వరం గ్రామంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహిం చారు. సర్పంచ్ నారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ల్యాండ్ సర్వే అధికారి రాజశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది: తహసీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో బుక్కాపురం గ్రామంలో మొదటి రోజు రెవెన్యూ సదస్సును రామాలయం ఆవరణలో నిర్వహించారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కామేశ్వరరెడ్డి, ఆర్ఐ సుబ్బారావు, గ్రామ సర్పంచ్ కందుల వరలక్ష్మి, ఎంపీటీసీ కుంచపు లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వీఆర్‌వోను సస్పెండ్ చేయండి

● జేసీ విష్ణుచరణ్‌కు మంత్రి ఆదేశం


వీఆర్‌వో గంగన్నపై ఫిర్యాదు చేస్తున్న యాగంటిపల్లె గ్రామస్థులు

బనగానపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలం యాగంటిపల్లె గ్రామంలో తీవ్ర అవినీతికి పాల్పడుతున్న వీఆర్‌వో గంగన్నను సస్పెండ్ చేయాలని రోడ్లు భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జేసీ విష్ణుచరణ్‌ను ఆదేశించారు. శుక్రవారం యాగంటిపల్లె గ్రామంలో నిర్వహించిన రైతు సదస్సులో యాగంటిపల్లె గ్రామానికి చెందిన నందీశ్వర రెడ్డి క్యాన్సర్‌తో మృతి చెందగా సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తు ఫారంపై సంతకం చేయించుకోవడానికి పోగా వీఆర్‌వో గంగన్న రూ.2వేలు ఇస్తేగాని సంతకం పెట్టనని బెదిరించాడని, చివరకు రూ.1200 తీసుకొని సంతకం పెట్టాడని బాధిత కుటుంబసభ్యురాలు శకుంతల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి రెవిన్యూ సదస్సులో తీసికెళ్లింది. మంత్రి వెంటనే వీఆర్‌వో గంగన్నను పిలిపించి సభలోనే వీఆర్‌వో గంగన్నను విచారించి సస్పెండ్ చేయాలని జేసీని ఆదేశించారు. జేసీ విష్ణుచరణ్ మాట్లాడుతూ వీఆర్‌వో గంగన్నపై పూర్తిస్థాయిలో బాధితుల నుంచి విచారణ స్వీకరించి సస్పెండ్ చేస్తామన్నారు.

విజయ పాల డెయిరీలో అక్రమాలపై విచారించాలి


మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడుతున్న భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నంద్యాల విజయ పాల డెయిరీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ నిర్వహించాలని రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ ఆళ్లగడ్డ నియోజకవర్గ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి శుక్రవారం కోరారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి లోకేశ్‌ను విఖ్యాత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఆళ్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడారు. నంద్యాల విజయ పాల డెయిరీలో జరుగుతున్న అవినీతిపై సమగ్రంగా విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని.. ఆళ్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధికి ఎళ్లవేళలా ముందుంటామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చినట్లు విఖ్యాత్‌రెడ్డి తెలిపారు.

పండుగలా మెగా పేరెంట్, టీచర్స్ సమావేశం


గోవిందపల్లెలో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

శిరివెళ్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాన్ని శనివారం పండుగలా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని గోవిందపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న సమావేశ ఏర్పాట్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. గ్రామ పెద్దలు, పాఠశాల పూర్వ విద్యార్థులను సమావేశానికి ఆహ్వానించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో డీటీ శంకర్ ప్రసాద్, గ్రామ పెద్దలు సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

సర్వేలపై శ్రద్ధ వహించాలి

కొలిమిగుండ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జరుగుతున్న వివిధ రకాల సర్వేలపై అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని నంద్యాల డివిజనల్ పంచాయతీ అధికారి శివారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల ఎంపీడీవో కార్యాలయాన్ని, గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ సర్వే, పీజీఆర్‌ఎస్, ఏపీ సేవ, ఆధార్ క్యాంపులు, ఎన్‌పిసీఐ, జియోట్యాగింగ్ తదితర అంశాలపై సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాదరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రాఘవరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా సయ్యద్ హుసేన్ నియాజ్



బనగానపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని వందపడకల ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా టీడీపీ మైనార్టీ నాయకుడు సయ్యద్‌హుసేన్ నియాజ్‌ను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి నియమించారు. సయ్యద్‌హుసేన్ నియాజ్ శుక్రవారం విలేఖర్లతో మాట్లాడుతూ వందపడకల ఆస్పత్రి అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మాచినేనిపల్లె పాల సొసైటీ ఎన్నికలు వాయిదా

రుద్రవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాచినేనిపల్లె గ్రామంలో పాల సొసైటీకి నిర్వహించాల్సిన పాల డైరీ ఎన్నికలు వాయిదా పడ్డాయని రుద్రవరం బల్క్‌మిల్క్ కేంద్రం ఇన్‌ఛార్జ్ మేనేజరు సాయి శుక్రవారం తెలిపారు. ఈ నెల 4న నిర్వహించిన ఎన్నికలు వాయిదా పడ్డాయని తెలిపారు. 9న రుద్రవరంలో 12న పెద్దకంబలూరులో, 16న చిన్నకంబలూరులో, రుద్రవరంలో 19న చందలూరులో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.


చింతలచెరువులో ఉల్లిగడ్డలపై పట్టలు కప్పుతున్న రైతులు


రుద్రవరం మండలం నల్లవాగుపల్లెలో మొలకెత్తిన మినుములు

కష్టం.. నష్టం

● ఆగని వర్షం ● తడిసిపోయిన ధాన్యం ● ఆందోళనలో రైతులు


చిన్నవంగలిలో కూలిన మట్టిమిద్దె

చాగలమర్రి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం 13 మీ.మీ వర్షపాతం నమోదైంది. పెద్దబోదనం, మద్దూరు, చాగలమర్రి, నేలంపాడు తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన జొన్న పంట నేలవాలింది. కోతకోసం ఆరబోసి రోడ్లపై, కలాల్లో ఉంచిన ధాన్యాన్ని వర్షం తడిపేసింది. 4 రోజుల నుంచి వర్షం పడుతుండటంతో అన్నదాతలు భయాందోళనకు గురౌతున్నారు. చిన్నవంగలి మట్టిమిద్దె కూలింది. మట్టి మిద్దెలో నివాసం ఉండరాదని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ప్రజలకు సూచిస్తున్నారు.

రుద్రవరం: రుద్రవరం మండలంలో శుక్రవారం మరలా వర్షం కురిసింది. నలవపల్లె గ్రామానికి చెందిన శివశంకర్ అనే రైతు మినుములు మొలకెత్తాయని ఆవేదన వ్యక్తం చేశారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

డోన్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ ఆక్రమణల వల్ల తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకే గ్రామ రెవెన్యూ సదస్సులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ఉంగరానిగుండ్ల గ్రామంలో గ్రామ రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ మీ భూమి- మీ హక్కు పేరుతో నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ రెవెన్యూ సదస్సుల్లో వచ్చే అర్జీలను అధికారులు పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం ఉంగరానిగుండ్ల గ్రామ ఎస్సీ కాలనీలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ ఆఫీసర్ రఘురాం, డోన్ తహసీల్దార్ నాగమణి, గ్రామ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● మండలంలోని కొత్తపల్లి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే అకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాల నాణ్యతను ఆయన పరిశీలించారు. విద్యార్థులను సమస్యలు అడగి తెలుసుకున్నారు. నాణ్యమైన రుచికరమైన భోజనాలు విద్యార్థులకు అందించాలని ఆదేశించారు.

● 8న డోన్‌లో జరిగే రాష్ట్ర స్థాయి లగోరి కాంపిటీషన్‌లో పాల్గొనే క్రీడాకారులకు క్రీడాదుస్తుల కోసం ఎమ్మెల్యే కోట్ల రూ.20వేల విరాళాన్ని కర్నూలు లగోరి అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు హరిప్రసాద్, మనోహర్‌లకు అందజేశారు.

కోవెలకుంట్ల: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల ప్రత్యేక అధికారి సోమశివారెడ్డితో కలిసి తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ముందుగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలలను సచివాలయ భవనాన్ని తనిఖీ చేశారు. అనంతరం రెవెన్యూ గ్రామసభ నిర్వహించగా 8 మంది రైతులు భూసమస్యలు పరిష్కరించాలని దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంటు పుల్లయ్య, వీఆర్వోలు ఆదినారాయణరెడ్డి, మురళి, రాజశేఖరొరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు మద్దిలేటి, బనగానపల్లె నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు రుషి, హోటల్ మద్దిలేటి పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని అలమూరు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసదస్సు నిర్వహించారు. గామసభలో 42 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దారు తెలిపారు.

ప్యాపిలి: రెవెన్యు సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దారు భారతి అన్నారు. శుక్రవారం మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో రెవెన్యు సదస్సును నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి పొలం తగాదాలు, పట్టాదారు పాస్‌బుక్ సమస్యలు, పొలం రస్తా గొడవలు ఉన్నా వినతులు ఇవ్వాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుజాత, రైతులు ఏనుగమర్రి రాము, సుదర్శన్, రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జాకిర్‌హుసేన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని గొడిగనూరు గ్రామంలో తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. జిల్లా ఈడీ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సభలను ఏర్పాటు చేసిందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సంజీవరాయుడు, టీడీపీ నాయకులు శేఖర్‌రెడ్డి, రామసుబ్బయ్య, సూర్యనారాయణ, ప్రమోద్‌కుమార్, నరసింహులు, సర్వేయర్ మద్దిలేటి, ఆర్‌ఐ అబ్దుల్‌సత్తార్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.


రుద్రవరం: ఆలమూరులో కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దారు మల్లికార్జునరావు

కొలిమిగుండ్ల: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బాలీశ్వరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దవెంతుర్ల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్వేయర్ సరిత, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభించామని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. గురువారం తుడుమలదిన్నె గ్రామంలో డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్‌బాబుతో కలిసి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తుడుమలదిన్నె గ్రామంలో ఆరు అర్జీలు వచ్చాయన్నారు. మండల సర్వేయరు విజయలక్ష్మి, వీఆర్వో దస్తగిరి ఉన్నారు.

అవుకు: భూసమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ పీడీ మండల స్పెషలాఫీసర్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని రామాపురం గ్రామంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. ఈ గ్రామ సభలో రైతుల నుంచి కేవలం 7 అర్జీలు మాత్రమే వచ్చాయి. కార్యక్రమంలో ఆర్‌ఐ వెంగళరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదాన సత్రం అభివృద్ధికి కృషి


అహోబిలంలో క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు శెట్టి విజయ్ కుమార్

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన దిగువ అహోబిలంలోని శ్రీకృష్ణదేవరాయ నిత్యాన్నదాన సత్రం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు అధ్యక్షుడు శెట్టి విజయ్ కుమార్ అన్నారు. లక్ష్మీ నృసింహ స్వామి సన్నిధిలో శ్రీకృష్ణదేవరాయ బలిజ, కాపు, తెలగ, ఒంటరి నిత్యాన్నదాన సత్రం, 2025 నూతన క్యాలెండర్‌ను జిల్లా సంఘం నాయకులు కోనేటి చంద్రబాబు నాయుడు, గూడూరు సంజీవరాయుడు, రామకృష్ణ, మైలేరి మల్లయ్య, పత్తి సుబ్బరామిరెడ్డిలతో కలిసి ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. అన్ని వర్గాల ప్రజలకు సత్రం సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తిరుపాలు, పత్తి సూర్య నారాయణ, నాగిరెడ్డి, పుల్లయ్య, సిద్ధి నారాయణ, శివరాయల్, రామచంద్రుడు, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

చాగలమర్రి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణ అందరి బాధ్యతని నంద్యాల అటవీశాఖ డైరెక్టర్, కృష్ణమూర్తి, డిప్యూటీ డైరెక్టర్ అనూరాగ్‌మీన తెలిపారు. శుక్రవారం మండలంలోని కేపీ తాండ గ్రామసమీపంలో ఉన్న అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో మొక్కలు నాటి ప్లాంటేషన్‌లుగా తయారు చేయాలని అటవీ సిబ్బందికి సూచించారు. అనుమతి లేనిదే అటవీలోకి ప్రవేశించరాదని అన్నారు. చెట్లను నరకడం, నిప్పు పెట్టడం చట్టరిత్యా నేరం అన్నారు. వారి వెంట రుద్రవరం రేంజర్ శ్రీపతినాయుడు, ఎఫ్‌వో రామకృష్ణ, అటవీ సిబ్బంది ఉన్నారు.

రజకుల సమస్యలపై నిరంతర పోరాటం


ఆళ్లగడ్డలో నియామక పత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని రజకుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేస్తున్నట్లు అఖిల భారత రజక సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రజకులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. అనంతరం రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా అమడాల రమణ, ఆళ్లగడ్డ మండల అధ్యక్షుడిగా ఆదినరసింహుడులను ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రాలు అందజేశారు.

నిరుద్యోగులకు మెరుగైన అవకాశాలు

\- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



ఆళ్లగడ్డలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ప్రణాళికతో వ్యవహరిస్తున్నట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఐటీ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని అనంత డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గంలో 5 వేల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల జాబ్ మేళా ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆమె తెలిపారు. ఆళ్లగడ్డలో త్వరలో ఏర్పాటు చేయనున్న సోలార్ కంపెనీ ద్వారా యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అఖిలప్రియ సూచించారు.

● యువత తమ లక్ష్యాలను సాధించేందుకు అహర్నిశలు కృషి చేయాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని బీఎస్ఎన్ఆర్ఎమ్ వెటర్నరీ, అగ్రికల్చర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫేర్వెల్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తల్లిదండ్రులు, దివంగత నేతలు భూమా నాగిరెడ్డి, భూమా శోభానాగిరెడ్డి చిత్రపటాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

గోశాలకు దాణా అందజేత


గోశాలకు మేతను విరాళంగా అందిస్తున్న దాతలు

బనగానపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యాగంటి క్షేత్రంలోని బసవన్న గోశాలకు రూ.12వేలు విలువ చేసే దాణా(తౌడు)ను సాధకొట్టం గ్రామానికి చెందిన బండి వెంకటేశ్ శుక్రవారం టీడీపీ నాయకుడు టంగుటూరు శ్రీనయ్య చేతుల మీదుగా గోశాల నిర్వాహకుడు బుర్రా వెంకటేశ్వర్లు శుక్రవారం అందించారు. నాయకులు లాయర్ నాగేంద్రారెడ్డి, ఖాదర్ మంగంపేట శ్రీనివాసులు, జోలాపురం తిరుమలయ్య, హరీష్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీల్లో సమస్యలపై దృష్టి సారించండి


తుడుమలదిన్నెలోని ఎస్సీ కాలనీలో సమస్యలను తెలుసుకుంటున్న తహసీల్దారు శ్రీనివాసులు

ఉయ్యాలవాడ, డిసెంబరు 6: మండలంలోని ఆయా గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో ఉన్న సమస్యలపై దృష్టి సారించాలని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. గురువారం తుడుమలదిన్నె గ్రామంలోని ఎస్సీ కాలనీల్లో డిప్యూటీ తహసీల్దారు ప్రసాదుబాబుతో కలిసి పర్యటించారు. కాలనీల్లోని సమస్యలను కాలనీవాసులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో డ్రైనేజి, పారిశుధ్యం, తాగునీటి సమస్యలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ సమస్యలపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీఆర్వో దస్తగిరి ఉన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి పల్లకి ఉత్సవం


మూడురాళ్లపల్లెలో వెంకటేశ్వరస్వామి పల్లకితో ఊరేగింపు

చాగలమర్రి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులచే శుక్రవారం వైభవంగా పల్లకి ఉత్సవం చేశారు. శ్రవణ నక్షత్రం సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు పారాయణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఓబుళరెడ్డి, వందనారెడ్డి, విజయమ్మ, రామనరసింహారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, నరసింహారెడ్డి, శేఖర్‌రెడి పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


వైద్యశాలను తనిఖీ చేస్తున్న జిల్లా నోడల్ అధికారి

చాగలమర్రి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తుండటం వల్ల ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా నోడల్ అధికారి జయచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు అంజలికి డీడీవో అధికారం ఉందని, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ అధికారాన్ని తనకు అప్పగించాలని వైద్యులను కోరామని అన్నారు. వారం రోజుల్లో డీడీవో అధికారాన్ని అప్పగిస్తామని వైద్యులు అంజలి చెప్పారని అన్నారు. డీడీవో అధికారం తీసుకోవాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో వైద్యశాలకు వచ్చినట్లు జయచంద్రారెడ్డి పేర్కొన్నారు.

వ్యక్తి అరెస్టు

కోవెలకుంట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని సంజమాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 62 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ సందీప్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బండి భాస్కర్ అనే వ్యక్తి మద్యం బాటిల్ విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా కాశిరెడ్డినాయన ఆరాధన

అవుకు, డిశంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అవుకు మండలం మంగంపేటతండా సమీపంలోని సీతారామపురం గ్రామంలో వెలసిన అవధూత కాశిరెడ్డి నాయన 29వ ఆరాధన ఉత్సవాలను గణపతిస్వామి ఆధ్వర్యంలో ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఉదయం కాశిరెడ్డినాయన ఆలయంలో అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఆరాధన ఉత్సవానికి హాజరై పూజల్లో పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ వర్ధంతి

జిల్లాలో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, నాయకులు, ప్రజా సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడని, నవభారత నిర్మాణంలో అంబేడ్కర్ కీలకపాత్ర పోషించారని అన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని కోరారు.


డోన్‌లో వైసీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఆ పార్టీ నాయకులు


బేతంచెర్ల పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు


చాగలమర్రి అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు


అవుకులో...


ప్యాపిలిలో ...


కోవెలకుంట్లలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు